
సాక్షి ఒడిశా

గురువారం । 18 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,46,605లు, బంగారం 9 గ్రాము 720 మిల్లీగ్రాములు, వెండి 237 గ్రాములు 800 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వారసత్వ ప్రాకారం ఆవిష్కరణ

రాష్ట్ర ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన పూరీ శ్రీజగన్నాథ దేవాలయం వారసత్వ ప్రాకారాన్ని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం ప్రజలకు అంకితం చేశారు

- 10లో



మార్మోగిన జగన్నాథ నామ స్మరణ

పూరీ శ్రీమందిరం వారసత్వ ప్రాకారం ప్రారంభోత్సవం పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా బుధవారం జగన్నాథ నామ స్మరణ మార్మోగింది.

- 10లో

న్యూస్‌రీల్

రాష్ట్రానికి అవార్డు



అవార్డు అందుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు

భువనేశ్వర్: స్టార్టప్ అభివృద్ధి రంగంలో రాష్ట్రం అగ్రగామిగా నిలిచింది. ఈ రంగంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ర్యాంకింగ్‌లో భాగంగా 2022 సంవత్సరానికి అవార్డు అందుకుంది. రాష్ట్ర సూక్ష్మ, లఘు, మధ్య తరహా వ్యాపార విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రంలో బలమైన స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడంలో అగ్రగామిగా గుర్తింపు పొందింది. రాష్ట్ర ప్రభుత్వం రెండు వేర్వేరు భాషల్లో పటిష్టమైన రాష్ట్ర స్టార్టప్ పోర్టల్ ఆవిష్కరణ, ఒరిస్సా స్టార్టప్ గ్రోత్ ఫండ్ (ఓఎస్‌జీఎఫ్)కు రూ.100 కోట్లు నిధుల బడ్జెటు కేటాయింపు వంటి కార్యక్రమాలు చేపట్టింది. అలాగే షెడ్యూల్డు కులాలు, తెగలు, దివ్యాంగులు, మహిళల వర్గంలో పారిశ్రామికవేత్తల అభివృద్ధికి సమగ్ర విధానాలతో అగ్రగామిగా నిలిచింది. దీంతో అవార్డుకు ఎంపికైనట్లు ప్రతినిధులు తెలియజేశారు.

మత్స్యకారుల వలకు భారీ తిమింగలం



జేసీబీ సాయంతో తిమింగలాన్ని తరలిస్తున్న దృశ్యం

బరంపురం: గంజాం జిల్లా సూన్‌పూర్ మత్స్యకారుల వలలో భారీ తిమింగలం చిక్కింది. గ్రామానికి చెందిన మత్స్యకారులు సూన్‌పూర్ తీరం నుంచి సముద్రంలో చేపల వేటకి వెళ్లారు. దీంతో వీరు వేసిన వలలో భారీ తిమింగలం చిక్కింది. వీరు ఒడ్డుకు తీసుకొని రావడంతో తిమింగలం చూడడానికి సమీప ప్రాంతాల ప్రజలు తరలివచ్చారు. సమచారం అందుకున్న సూన్‌పూర్ మెరైన్ పోలీసులు, జిల్లా మత్స్యశాఖ అధికారులు సూన్‌పూర్ తీరానికి చేరుకొని జేసీబీ సాయంతో తిమింగలాన్ని పూడ్చిపెట్టారు.

ఈవీఎంల పనితీరుపై డెమో



డెమో చూపిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకొని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గజపతి జిల్లాలోని పర్లాకిమిడి పురపాలక కార్యాలయంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల పనితీరుపై బుధవారం డెమో ప్రదర్శించారు. పలువురు ఓటర్లకు ఓటు ఎలా పడుతుందో తెలియజేశారు. పర్లాకిమిడిలో 36 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. దీంతో అయా బూత్‌లకు కలెక్టరేట్ సిబ్బంది ఒక మొబైల్ వ్యాన్‌లో వెళ్లి అవగాహన కల్పిస్తారు.

నాటక మహోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోడూరు

పర్లాకిమిడి: స్థానిక అర్బన్ బ్యాంక్ గ్రౌండ్స్‌లో రాష్ట్రస్థాయి నాటక ఉత్సవాలను బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు మాట్లాడుతూ.. అంతరించిపోతున్న నాటక రంగానికి గత పదేళ్లుగా పర్లాకిమిడిలో క్రియేటివ్ ఆర్ట్స్ ద్వారా ప్రాణం పోస్తున్నారని తెలియజేశారు. అనంతరం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బీరేంద్ర కుమార్ దాస్, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్, మున్సిపల్ చైర్మన్ నిర్మలా శెఠి, రంగస్థల నటుడు దేవేంద్ర దాస్, క్రియేటివ్ ఆర్ట్స్ అధ్యక్షుడు నృసింహ చరణ్ పట్నాయిక్ తదితరులు నాటక రంగానికి సేవ చేసిన మహనీయులకు నివాళులర్పించారు. అదేవిధంగా నాటక రంగానికి మూడు దశాబ్దాలు సేవచేసిన స్వర్గీయ ప్రవీణ్ పండా స్మృతి అవార్డును భువనేశ్వర్‌కు చెందిన ప్రదీప్ బిశ్వాల్‌కు అందజేశారు. మొత్తం 3 రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. తొలిరోజు శ్రీజగన్నాథస్వామి 'భాభరో ఠాకురో' నాటకాన్ని ప్రదర్శించారు.

కాంగ్రెస్‌లోకి... మాజీ సీఎం గిరిధర్ గొమాంగో



గిరిధర్ గొమాంగోను ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- 8 నెలల వ్యవధిలో బీఆర్‌ఎస్‌కు గుడ్ బై

భువనేశ్వర్/రాయగడ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. దీనిలో భాగంగా కాంగ్రెస్ పార్టీ తమ మాజీ నాయకులను మరలా పార్టీలోకి తీసుకొస్తోంది. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ గిరిజన నాయకుడు గిరిధర్ గొమాంగో కుటుంబంతో పాటు బర్‌గడ్ లోక్‌సభ నియోజకవర్గం మాజీ సభ్యుడు సంజయ్ భొయి కాంగ్రెసు పార్టీలో బుధవారం తిరిగి చేరారు. న్యూఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వీరంతా కాంగ్రెస్‌లో చేరారు. ఈ జాబితాలో గిరిధర్ గొమాంగో, ఆయన భార్య, కొరాపుట్ మాజీ ఎంపీ హేమాబతి గొమాంగో, వారి కుమారుడు శిశిర్ గొమాంగో, సంజయ్ భోయ్‌లతో సహా నలుగురు నేతలు కాంగ్రెస్ కోశాధికారి అజయ్ మాకెన్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి డాక్టర్ అజోయ్ కుమార్ సమక్షంలో తిరిగి పార్టీలోకి చేరినట్లు ప్రకటించారు.

రాష్ట్రాభివృద్ధికి గొమాంగో కృషి

ఈ సందర్భంగా అజయ్ మాకెన్ మాట్లాడుతూ.. ఒడిశా రాష్ట్ర ప్రజల అభివృద్ధికి గొమాంగో, అతని కుటుంబం గణనీయమైన కృషి చేశారన్నారు. గొమాంగో కుటుంబం, బర్‌గఢ్ మాజీ ఎంపీ మళ్లీ కాంగ్రెస్‌లో చేరడంతో పార్టీ మరింత బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు నలుగురు నేతలు శనివారం న్యూఢిల్లీలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అజోయ్ కుమార్‌తో సమావేశమయ్యారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి...

గిరిధర్ గొమాంగో 2015 సంవత్సరంలో కాంగ్రెస్ వీడి బీజేపీలో చేరారు. గతేడాది ఆగస్టులో బీజేపీని వీడి కేసీఆర్ నేతృత్వంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)లో చేరారు. అయితే బీఆర్‌ఎస్‌కు ఏమాత్రం బలం, భవిష్యత్ లేకపోవడంతో 8 నెలల వ్యవధిలోనే మరలా కాంగ్రెస్‌లోకి వచ్చారు. గిరిధర్ గొమాంగో మరియు అతని కుమారుడు శిశిర్ గొమాంగో ఇరువురు గతేడాది జనవరి 25న బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి, రెండు రోజుల తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. 1972 నుంచి 2004 మధ్య కొరాపుట్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి తొమ్మిది సార్లు ఎంపీగా ఎన్నికైన గిరిధర్ గొమాంగో, చివరిసారిగా 2014 ఎన్నికల్లో ఈ స్థానం నుండి పోటీచేసి బిజూ జనతా దళ్ అభ్యర్థి జిహ్నా హికాకా చేతిలో ఓడిపోయారు. అదేవిధంగా సంజయ్ భొయ్ 2009 సంవత్సరం ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్‌పై బర్‌గఢ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేసి 3.97 లక్షల ఓట్లతో గెలిపొందారు. తదుపరి 2014 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో పోటీచేసి మూడో స్థానానికి పరిమితమయ్యారు. కాగా 2019 సార్వత్రిక ఎన్నికల్లో టిక్కెట్ నిరాకరించడంతో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఇదిలా ఉండగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు తుది మెరుగులు దిద్దుతున్న కాంగ్రెస్ రాబోయే ఎన్నికల్లో సంజయ్ భొయికి బర్‌గడ్ నియోజకవర్గం నుంచి టికెట్ ఇచ్చే అవకాశం ఉందని సన్నిహిత వర్గాలు భావిస్తున్నాయి.

పూర్వ వైభవం తీసుకొస్తాం: గిరిధర్ గొమాంగో

పార్టీలో చేరిన అనంతరం గిరిధర్ గొమాంగో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. ఈరోజు మరలా తాను సొంత గూటికి వచ్చినట్లు ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీలో 50 సంవత్సరాలు సేవలందించానని, ఇందులో 11 సార్లు కొరాపుట్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించానని వెల్లడించారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల కాంగ్రెస్‌కు దూరంగా ఉండాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అనంతరం బీజేపీ వంటి పార్టీలో చేరినప్పటికీ, ఆ పార్టీ తనకు సముచితమైన స్థానం, గౌరవం ఇవ్వకపోవడంతో తిరిగి ఆ పార్టీని వదలాల్సి వచ్చిందని వెల్లడించారు. కాంగ్రెస్ వంటి సిద్ధాంత పరమైన పార్టీని వీడి తాను పెద్ద తప్పు చేశానని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్ధాంతాలకు, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచే కాంగ్రెస్ పార్టీలో పూర్తి సేవలు అందిస్తానని తెలియజేశారు.

వృద్ధులకు తీర్థయాత్ర



వర్చువల్ విధానంలో యాత్ర ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

బరంపురం: స్థానిక రైల్వేస్టేషన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఐదు జిల్లాలకు చెందిన 1,000 మంది వృద్ధులను తీర్థయాత్రలకు పంపించింది. కలెక్టర్ దివ్య జ్యోతి పరిడా ఆదేశంతో బుధవారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో గంజాం, గజపతి, కొందమాల్, బౌద్, నయాగడ జిల్లాలకు చెందిన వృద్ధులకు బయల్దేరారు. వీరంతా వారణాసి, ప్రయాగ తదితర ప్రాంతాల్లో యాత్రలు పూర్తి చేసుకొని ఈనెల 21న మరలా బరంపురం చేరుకుంటారని వివరించారు. కార్యక్రమంలో బీజేడీ జిల్లా అధ్యక్షుడు రమేష్ చావ్ పట్నాయక్, బీడీఏ చైర్మన్ సుభాష్ మహరణ తదితరులు పాల్గొన్నారు. ట్రైన్‌ను వర్చువల్ విధానంలో సీఎం నవీన్ పట్నాయక్ ప్రారంభించారు.



తీర్థయాత్రకి బయల్దేరుతున్న వృద్ధులు

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్




మందిరం ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక మజ్జిగౌరి మందిరం వద్ద బీజేపీ కార్యకర్తలు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. దీనిలో ఆ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సమీర్ మహంతి సైతం పాల్గొన్నారు. అనంతరం సిరిగుడలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఈసారి బీజేపీ అనుకూల పవనాలు వీస్తున్నాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పార్టీ విజయానికి సోపానాలుగా మారుతాయని, కార్యకర్తలు సమష్టిగా ఉంటే పార్టీ విజయం తథ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా శాఖ కార్యదర్శి ప్రతాప్ పువ్వల, ఓబీసీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు రామచంద్ర బెహర, జిల్లా యువమోర్చ అధ్యక్షుడు ప్రీతమ్ కుమార్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు .

శ్రీసేతు ప్రారంభం



శ్రీసేతు (పగటి పూట ఇలా...)



శ్రీసేతు (రాత్రి పూట ఇలా...)

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం వారసత్వ ప్రాకారం లోకార్పణ మహోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రాష్ట్రంలోని తొలి ట్రంపెట్ వంతెన శ్రీసేతును బుధవారం ప్రారంభించారు. 2.3 కి.మీ పొడవైన 4 అంచెల శ్రీసేతును రూ.200 కోట్లు వెచ్చించి నిర్మించారు. ఇది పూరీ జాతీయ రహదారి బైపాస్ నుంచి పట్టణంలోని జగన్నాథ్ వల్లభ్ యాత్రికుల కేంద్రం వరకు నిర్మాణం చేపట్టారు. దీనివలన దీర్ఘకాలిక ట్రాఫిక్ సమస్యలు తొలగిపోతాయి. శ్రీసేతు గుండా పూరీలోకి ప్రవేశించే భక్తులకు స్వాగతం పలికేందుకు ప్రత్యేక తోరణ ద్వారం నిర్మించారు. పూరీ పట్టణం సమగ్ర సౌందర్యం వీక్షించేందుకు వీలుగా వీక్షణ టవర్ శ్రీసేతులో ఏర్పాటు చేయడం విశేషం.

ఎట్టకేలకు..!

- తీరనున్న కార్మికుల పీఎఫ్ సమస్య
- ఎంపీ సప్తగిరి ఉల్కకు కార్మికుల కృతజ్ఞతలు



పార్లమెంట్‌లో సమస్యపై మాట్లాడుతున్న ఎంపీ ఉల్క

జయపురం: స్థానిక గగణాపూర్ సేవా పేపరు మిల్లు కార్మికుల దీర్ఘకాల ఆందోళనకు ప్రతిఫలం లభించింది. కలకత్తాలోని కరమ్‌చంద్ థాపర్ ట్రస్టులో పేపర్ మిల్లు గత యాజమాన్యం జమ చేసిన కార్మికుల పీఎఫ్ డబ్బులు, త్వరలోనే బరంపురం అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసేందుకు కలకత్తా పీఎఫ్ కమిషనర్ అంగీకరించారు. దీంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టకేలకు కార్మికుల పీఎఫ్‌ను బరంపురం బదిలీ చేసేందుకు అంగీకరించారని ఎంపీ ఉల్క తెలియజేయడంతో, అతి త్వరలోనే తమ ఖాతాల్లో నిధులు జమ అవుతాయని కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బరంపురం బదిలీ చేసేందుకు కృషి చేసిన ఎంపీ ఉల్కకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇదీ విషయం

సేవా పేపరు మిల్లు పాత యాజమాన్యం మిల్లును మథర్ అర్థ రిసోర్స్ కంపెనీకి అమ్మిన తర్వాత పీఎఫ్ సమస్య జటిలమైంది. 2020 ఫిబ్రవరి 26వ తేదీన బాధ్యతలు చేపట్టిన మథర్ అర్థ కంపెనీ యజమానులు బరంపురం పీఎఫ్ కమిషన్ వద్ద కార్మికుల పీఎఫ్ అమౌంట్ జమ చేస్తున్నారు. అయితే పాత యాజమాన్యం కలకత్తా కార్యాలయంలో జమ చేసిన నిధులు, బరంపురం కార్యాలయంకు బదిలీ అవ్వకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. దాదాపు 1,222 మంది కార్మికుల రూ.3 కోట్లకు పైగా పీఎఫ్ డబ్బులు అక్కడ ఉండిపోయాయి. దీంతో సమస్య పరిష్కారానికి కార్మికులు ఆందోళన చేపట్టారు. అలాగే ఎంపీ ఉల్క కృషి చేయడంతో ప్రస్తుతం బదిలీకి మార్గం సుగమం అయ్యింది.

ప్రారంభోత్సవాన్ని బహిష్కరించండి

- మావోయిస్టుల పిలుపు

కొరాపుట్: అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవాన్ని బహిష్కరించాలని మావోయిస్టులు పిలుపునిచ్చారు. బుధవారం ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని దండకారణ్యంలో లేఖ విడుదల చేశారు. మావోయిస్టుల అనుబంధ సంస్థగా పిలవబడే క్రాంతి కారీ ఆదివాసీ మహిళా సంఘటన దండకారణ్య ప్రతినిధి రాంకో పేరిట ఈ లేఖ విడుదలైంది. ప్రజలు కూడు, గుడ్డ కోసం అల్లాడుతుంటే కేంద్ర ప్రభుత్వం రూ.కోట్లు వృథా చేస్తోందన్నారు. ఆ డబ్బు పేదల ఉన్నతికి ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు. బాధ్యత కలిగిన పౌరులు ఈ కార్యక్రమాన్ని తమ స్థాయిలో వ్యతిరేకించాలని కోరారు. తరతరాలుగా పాలకులు మతం పేరిట ప్రజల మనోభావాల్లో చీలిక తెస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజలు పాలకుల కుయుక్తులు పసిగట్టాలన్నారు. ఇది కేవలం రాజకీయ విన్యాసం అని లేఖలో పేర్కొన్నారు.



మావోయిస్టుల విడుదల చేసిన లేఖ

పింఛన్ కోసం నిరాహార దీక్ష



బ్యాంకు వద్ద నిరాహార దీక్ష చేపట్టిన శకుంతల

రాయగడ: తన భర్త ప్రభుత్వ ఉద్యోగం చేసి మృతి చెందగా, అనంతరం న్యాయపరంగా తనకు అందాల్సిన పింఛన్‌ను ఎస్‌బీఐ అధికారులు ఇవ్వడం లేదని నిరసిస్తూ శకుంతల మహంతి అనే వృద్ధురాలు నిరాహార దీక్ష చేపట్టారు. స్థానిక ఎస్‌బీఐ ప్రధాన శాఖ వద్ద బుధవారం మరో మహిళ సహకారంతో దీక్షకు దిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన భర్త దివంగత సత్యవాది మహంతి అటవీ శాఖలో ఉద్యోగం చేసి 2003లో మృతి చెందారని తెలియజేశారు. అనంతరం పింఛన్ కోసం రాజధాని భువనేశ్వర్‌లో ఉన్నటువంటి ఏజీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా, వారు దానిని ఆమోదించి బ్యాంకుకు, అదేవిధంగా జిల్లా ట్రెజరీ కార్యాలయానికి పింఛన్ అందజేయాలని ఆదేశించారన్నారు. కానీ బ్యాంక్ సిబ్బంది సంబంధింత పత్రాలు అందజేసినా నేటికీ పింఛన్ చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతూ బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోయిందని వాపోయారు. తనకు న్యాయం జరిగేంత వరకు దీక్షను కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

కోర్టులో కేసు ఉంది

ఈ విషయంపై బ్యాంక్ మేనేజర్ ఎంకే బెహరా స్పందిస్తూ పింఛన్ విషయం ప్రస్తుతం కోర్టులో ఉందని తెలియజేశారు. ఆందోళన చేస్తున్న శకుంతల మహంతికి పింఛన్ తీసుకునేందుకు అర్హత లేదని ఒక వ్యక్తి హైకోర్టులో కేసు వేశారని వెల్లడించారు. ఆమెకు కుటుంబ వారసత్వ (లీగల్ హెయిర్) సర్టిఫికెట్ లేదని కేసు వేశారని పేర్కొన్నారు. కేసు ఇంతవరకు ఒక కొలిక్కి రాకపోవడంతో తీర్పు వచ్చేంత వరకు తాము ఏమీ చేయలేమని వివరించారు.

భారీగా గంజాయి స్వాధీనం



రాయగడ: పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

రాయగడ: రాష్ట్రంలోని ఫుల్బాణి జిల్లా నుంచి కేరళ రాష్ట్రానికి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బిసంకటక్ పోలీసులు అరెస్టు చేశారు. బిసంకటక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ ప్రసన్న నాయక్ తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం ఎప్పటిలాగే పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో చాటికొన హటొపాదొరా వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించడంతో వారిని ఆపి తనిఖీలు నిర్వహించారు. దీంతో వారి వద్ద ఉన్నటువంటి రెండు పాలిథిన్ సంచుల్లో 21 కిలోల గంజాయి పట్టుబడింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులైన ఉత్తరప్రదేశ్‌కు చెందిన బుర్హాహ అహ్మద్(26), పశ్చిమ బెంగాల్‌కు చెందిన మహ్మద్ రబీ (23)లను అరెస్టు చేసి బుధవారం కోర్టుకు తరలించారు.

బరంపురం: నగరం వైపునకు తరలిస్తున్న 50 కిలోల గంజాయిని ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. ఎస్పీ జగ్‌మోహన్ మీన తెలిపిన వివరాల మేరకు.. గంజాం జిల్లా దిగపండి నుంచి 59వ నంబర్ జాతీయ రహదారి మీదుగా బరంపురం వైపు వస్తున్న ఒక ఆటోలో గంజాయి రవాణ అవుతున్నట్లు ఎక్సైజ్ అధికారులకు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో జాతీయ రహదారిలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా డెంగపదర దగ్గర ఇంద్రా అబాస్ జంక్షన్ వద్ద ఆటోపై దాడులు నిర్వహించి, 7 బస్తాల్లో తరలిస్తున్న 50 కిలోల గంజాయితో పాటు ఆటోని సీజ్ చేసి ఒకరిని అరెస్టు చేశారు. అరెస్టైన నిందితుడు గజపతి జిల్లా అడవా గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రాధాకాంత్ సింగ్‌గా గుర్తించారు.



బరంపురం: అరెస్టైన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



విక్టర్ ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: విజయవాడలో జరగనున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలంతా తరలిరావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించి బుధవారం శ్రీకాకుళం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 125 అడుగుల పొడవైన అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19న ఆవిష్కరించనున్నారని చెప్పారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న ఈ మహత్తర కార్యక్రమానికి లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ప్రిన్సిపాల్స్ దేవేందర్‌రావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విక్టర్ ప్రసాద్‌ను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ ఆర్అండ్‌బీ వసతి గృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అసోం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కోటపాడు వాసి



కోత రవి

సంతబొమ్మాళి: మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన ఐఏఎస్ అధికారి కోత రవి అసోం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ మేరకు అక్కడి ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి పబన్‌కుమార్ బోర్త కూర్ పదవీకాలం త్వరలో ముగియనున్నందున రవి నియామకం జరిగిందని ఆయన సోదరుడు, జిల్లా కిసాన్ సంఘ అధ్యక్షుడు కోత మధుసూ దనరావు స్థానిక విలేకరులకు తెలిపారు.

వీసీకి వీడ్కోలు



వీసీ దంపతులను సన్మానిస్తున్న వర్సిటీ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా మూడేళ్ల టెర్మ్ పూర్తి చేసుకుని రిలీవైన నిమ్మ వెంకటరావు, విజయలక్ష్మి దంపతులను బుధవారం వర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల పదవీకాలం సంతృప్తినిచ్చిందని చెప్పారు. ప్రభుత్వ సహకారంతో వర్సిటీని ప్రగతి పథంలో నడిపించినట్లు తెలిపారు. కనోనా సమయంలోనూ అకడమిక్ సమస్యలు సమర్థంగా ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. నాక్ గుర్తింపు సాధించటం, మౌలిక వసతులు కల్పన, కొత్తకోర్సుల ప్రారంభం వంటి చర్యలు సంతృప్తినిచ్చాయని పేర్కొన్నారు. ఉన్నత విద్య బలోపేతానికి కృషి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, సీడీసీ డీన్ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, డాక్టర్ చింతాడ రాజశేఖరరావు, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు బగాది రామ్మోహన్‌రావు, విజయనగరం జేఎన్‌టీయూ పాలక మండలి సభ్యులు బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

25న అండర్-12 క్రికెట్ జట్టు ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలు ఈ నెల 25వ తేదీకి వాయిదాపడ్డాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా వాస్తవానికి ఈ ఎంపికలు ఈ నెల 21న జరగాల్సి ఉంది. అయితే సంక్రాంతి సెలవుల నేపథ్యంలో క్రీడాకారుల రాకపోకల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వాయిదావేసినట్టు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు శాస్త్రి, హసన్‌రాజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు గమనించాలని కోరారు. అదే విధంగా, జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21న జరగాల్సిన జిల్లాస్థాయి అంపైర్లు, స్కోరర్లు ఎంపిక పరీక్షలు సైతం ఈ నెల 25నే జరగనున్నాయని పేర్కొన్నారు.

వారసత్వ ప్రాకారం ఆవిష్కరణ

భువనేశ్వర్


: రాష్ట్ర ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన పూరీ శ్రీజగన్నాథ దేవాలయం వారసత్వ ప్రాకారాన్ని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్ సమక్షంలో ప్రజలకు అంకితం చేశారు. జగన్నాథుని ఆశీస్సుల వల్లే ఈ ప్రాజెక్టు సాధ్యమైందని ముఖ్యమంత్రి అన్నారు. దాదాపు 90 ఆలయాల ప్రతినిధులు, వేలాది మంది భక్తులు ఈ మహోత్సవానికి హాజరయ్యారు. ప్రారంభోత్సవం తర్వాత గజపతి మహారాజా 3 రోజుల మహా యజ్ఞాన్ని ముగించడానికి పూర్ణాహుతి ఆచార వ్యవహారాల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ మందిరం పరిసరాల్లో మంత్రాలు, వేద శ్లోకాల పఠనంతో ఆధ్యాత్మిక వాతావరణం అలముకుంది. ముందుగా పట్టణం శివారులో ఏర్పాటు చేసిన తాత్కాలిక హెలిప్యాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, అక్కడ నుంచి రోడ్డు మార్గంలో మహోత్సవ ప్రాంగణానికి చేరారు. శ్రీ మందిరం వారసత్వ ప్రాకార ప్రాజెక్ట్‌పై అనేక డాక్యుమెంటరీ వీడియోలను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆవిష్కరించారు. ప్రాకార ప్రణాళిక అమలులో వీరందరి పాత్ర అత్యంత కీలకమని అభినందించారు. రూ.800 కోట్ల వ్యయంతో నిర్మించిన వారసత్వ ప్రాకారం ఆలయం నలువైపుల ఆక్రమించుకుని ఉన్న అడ్డంకుల్ని తొలగించి, కనులారా శ్రీ మందిరం పరిసరాలను తిలకించేందుకు వీలుగా రూపుదిద్దుకుంద న్నారు. లోగడ ఈ ప్రాంగణం ఆక్రమణలతో తిరుగాడేందుకు ఇబ్బందికరంగా ఉండేది.



వారసత్వ ప్రాకారం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్



పూర్ణాహుతి కార్యక్రమంలో పూరీ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్



ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, గజపతి మహారాజా పరస్పర అభివాదం



శ్రీమందిరం ప్రాకారం



పూరీ సముద్ర తీరంలో సుదర్శన్ పట్నాయక్ ఆవిష్కరించిన సైకత శిల్పం

మార్మోగిన జగన్నాథ నామ స్మరణ

పూరీ శ్రీమందిరం వారసత్వ ప్రాకారం ప్రారంభోత్సవం పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా బుధవారం జగన్నాథ నామ స్మరణ మార్మోగింది. అన్ని జగన్నాథ ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రజలు చేపట్టారు. స్వామివారికి అత్యంత ప్రీతికరమైన రసగుల్లాను ప్రసాదంగా నివేదించారు. భక్తులు అఖండ దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు పలుచోట్ల బిగ్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పలుచోట్ల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



జయపురం: నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు



జయపురం: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: శ్రీజగన్నాథ మందిరం వద్ద భక్తి గీతాలాపన



పర్లాకిమిడి: శ్రీమందిర పరిక్రమ ఉత్సవాన్ని తిలకిస్తున్న ప్రజలు



రాయగడ: ముగ్గులు వేస్తున్న మహిళలు



కొరాపుట్: ర్యాలీలో పాల్గొన్న ప్రదీప్ మజ్జి, సదాశివ ప్రదాని తదితరులు



రాయగడ: పూలతో అలంకరించిన జగన్నాథ మందిరం



రాయగడ: పూలతో అలంకరించిన జగన్నాథ మందిరం

'వృద్ధాప్య పింఛన్ పెంచాలి'



ఆందోళన చేపడుతున్న దృశ్యం

జయపురం: రాష్ట్రంలో వృద్ధాప్య, వికలాంగ, వితంతు పింఛన్లను రూ.5,000లకు పెంచాలని పింఛన్‌దారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో స్థానిక బస్టాండ్ కూడలి వద్ద ప్లకార్డులతో బుధవారం నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి జుధిస్టర్ రౌలో మాట్లాడుతూ.. పెన్షన్ లబ్ధిదారుల డిమాండ్లను సీఎం నవీన్ పట్నాయక్‌కు పోస్టులో పంపామని వెల్లడించారు. ఈ జిల్లాలో నిరుపేదలకు, ఆదివాసీ బడుగువర్గాల ప్రజలకు న్యాయం జరగడం లేదని విమర్శించారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వం ప్రతినెలా రూ.3,000 పింఛన్ ఇస్తోందని గుర్తు చేశారు. కానీ ఒడిశా రాష్ట్రంలో కేవలం రూ.500లు మాత్రమే అందిస్తున్నారని మండిపడ్డారు. అందువలన పింఛన్ రూ.5 వేలకు పెంచడంతో పాటు వయో పరిమితి 55 ఏళ్లకు తగ్గించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్‌లు పరిష్కరించేవరకు ఆందోళనలు జరుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ కార్యవర్గ సభ్యుడు ప్రమోద్ కుమార్ మహంతి, జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణ దాస్, సత్యబ్రత నందో, నిత్యానంద పాత్రో, నంద హరిజన్, సన్యాసీ మాలి, కమల లోచన సాగరియ తదితరులు పాల్గొన్నారు.

భక్తజన జాతర



శ్రీరాంపాడు యాత్రకు వచ్చిన జనసందోహం

నరసన్నపేట: సంక్రాంతి పండగ సందర్భంగా పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న యాత్రలు జన జాతరను తలపిస్తున్నాయి. నరసన్నపేట మండలం రెడ్డికిపేట-అంపలాం మధ్య బసివలస రోడ్డుకు ఆనుకొని మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన యాత్రకు జనం పోటెత్తారు. వేలాది మంది తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గత వందేళ్లుగా ముక్కనుమ నాడు శివాలయం వద్ద జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.పక్కాగా ఏర్పాట్లు చేయడంతో ఎటువంటి వివాదాలు లేకుండా యాత్ర ముగిసిందని గొట్టిపల్లి, దూకులపాడు సర్పంచ్ అవ్వ రవీంద్ర రెడ్డి, అల్లు అశిరినాయుడు, కమిటీ ప్రతినిధులు శిమ్మ లక్ష్మణరావు, కోరెడ్డి నాగరాజు తెలిపారు.



సంగమేశ్వర జాతరలో పాల్గొన్న భక్తులు

కంబకాయలో..

కంబకాయ గ్రామంలో స్వయంబేశ్వరా ఆలయం 74 వార్షికోత్సవం సందర్భంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. యాత్ర ప్రశాంతంగా జరిగిందని సర్పంచ్ పాగోటి కుసుమ కుమారి తెలిపారు. మండల పరిధిలోని చెన్నాపురంలో యాత్ర ఘనంగా జరిగింది.

సంగమయ్య ఆలయం వద్ద..

ఆమదాలవలస రూరల్: మండలంలోని గాజుల కొల్లివలస సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద మూడో రోజు బుధవారం కూడా యాత్రకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ముక్కనుమ కావడంతో స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. కొండపై ఉన్న సంగమయ్యకు కొబ్బరికాయలు, అరటిపళ్లతో పూజలు చేసి కొండ దిగువ ప్రాంతంలో నిర్వహించిన జాతరలో పాల్గొన్నారు. కొండ ప్రాంతమంతా జనంతో కిక్కిరిసిపోయింది. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది.

● విరామం



సంక్రాంతికి పల్లెల్లో ప్రతి ఇంటా సందడి చేసిన డూడూ బసవన్నలు(గంగిరెద్దు) అలసిపోయాయి. మెళియాపుట్టి మండలం మర్రిపాడు-కె గ్రామంలో ఓ వ్యక్తి గంగిరెద్దును స్వగ్రామానికి తీసుకెళ్తుండగా పలువురు చిన్నారులు బై బై బసవన్నా అంటుండగా 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– మెళియాపుట్టి

● వినూత్నం



ఒడిశా రాష్ట్రం చిలకా సరస్సు సమీపంలో నేవీ సెంటర్ నుంచి విశాఖపట్నం నేవీ సెంటర్‌కు యుద్ధ విమానాన్ని తీసుకెళ్తున్న ఓ లారీ పలాస మండలం లక్ష్మీపురం టోల్‌ప్లాజా వద్ద బుధవారం కాసేపు ఆగడంతో ప్రయాణికులు ఆశ్చర్యపోయారు. గాల్లో ఎగరాల్సిన విమానం రోడ్డుపైకి వచ్చిందంటూ ఆసక్తిగా తిలకించారు.

– కాశీబుగ్గ

క్లుప్తంగా

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును బాధితులకు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య బుధవారం అందజేశారు. మండల కేంద్రం బొండపల్లి గ్రామానికి చెందిన నమ్మి జ్యోతి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఈవిషయాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీవీ ప్రభుజీ రాజు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేశారు. ఈ మేరకు సహాయ నిధి నుంచి రూ.80 వేల చెక్కు మంజూరు కాగా దానిని జ్యోతి భర్త సంతోష్‌కు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

చెంచుల కాలనీలో అగ్నిప్రమాదం



అగ్నికి ఆహుతవుతున్న చెంచుల కాలనీ

విజయనగరం క్రైమ్: స్థానిక అయ్యన్నపేట శివారు ప్రాంతంలో ఉన్న చెంచుల కాలనీలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని అగ్నిమాక శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఎనిమిది ఇళ్లు దగ్ధమయ్యాయని, సుమారు రూ.9 లక్షల 60వేల వరకూ ఆస్తినష్టం జరిగి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రమాద విషయం తెలియగానే హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను రెండు గంటల పాటు శ్రమించి అదుపులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదన్నారు.

టీడీసీ నాయకుడి దాష్టీకం

- చంద్రబాబు సభకు రాలేదని గిరిజనుడిపై దాడి



మాట్లాడుతున్న బాధితుడు రామయ్య

సాలూరు: ఇటీవల బొబ్బిలిలో జరిగిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బహిరంగ సభకు పిలిచినా రాలేదన్న ఆగ్రహంతో టీడీపీ నాయకుడు విచక్షణా రహితంగా కొట్టి దాడి చేశాడని ఓ గిరిజన బాధితుడు వాపోతూ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సాలూరు మండలంలోని సారిక గ్రామానికి చెందిన బాధితుడు పూసూరు రామయ్య ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. ఇటీవల బొబ్బిలిలో జరిగిన బహిరంగసభకు రావాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు డి.రామకృష్ణ తనను పిలిచినా, వెళ్లకపోవ డంతో సభకు రాలేదన్న కారణంతో ఈ నెల 14న రాత్రి 7 గంటల సమయంలో తన ఇంటికి రామకృష్ణ వచ్చి తిట్టడంతోపాటు విచక్షణా రహితంగా కొట్టాడని, అంతేకాకుండా కర్రతీసుకుని మరోసారి కొట్టడా నికి రాగా స్థానికులు అడ్డుకున్నారని ఫిర్యాదులో తెలిపాడు. తనను తిట్టి, కొట్టి చంపుతానని బెదిరించడంతో పాటు, తన ఇంటిని ధ్వంసం చేస్తానని, ఊరు నుంచి తగిలేస్తానని భయపెట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదుచేసి, తనకు ప్రాణరక్షణ కల్పించి రామకృష్ణ నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

సాలూరు: పట్టణంలోని మహంతివీధిలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న 9 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్సై సురేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు మహంతివీధి రామాలయం దగ్గరలో బహిరంగ ప్రదేశంలో పేకాట శిబిరాన్ని గుర్తించామన్నారు. అక్కడ పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,79,510 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సామాజిక సాధికారతకు... అంబేడ్కర్ విగ్రహమే సాక్ష్యం

- రేపే విజయవాడలో మహావిష్కరణ
- పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు



రాజ్యాంగ స్ఫూర్తి సాకారం...

భారత రాజ్యాంగంలో ఆర్టికల్స్ ప్రకారం ఒక పనికి సమాన వేతనం ఇవ్వాలి. లింగ వివక్ష ఉండకూడదు. మహిళలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి. వాటిని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆచరణలో చూపించారు. మహిళలకు స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం రిజర్వేషను కచ్చితంగా అమలుచేశారు.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల భారీ కాంస్య విగ్రహం... విజయవాడ నడిబొడ్డున ఈ నెల 19న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఎక్కడో ఊరి చివరన, ఎస్సీ కాలనీల్లో అంబేడ్కర్ విగ్రహం ఉండటాన్నే దశాబ్దాలుగా చూస్తున్నాం. అంబేడ్కర్ ఏ ఒక్క వర్గానికో, ఏ ఒక్క కులానికో కాదు ఆయనో దేశ సంపద. ఆయన స్ఫూర్తితో తన నాలుగున్నరేళ్ల పాలనలో బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు తాను అందించిన భరోసాను, సాధించిన సామాజిక సాధికారతను ప్రజానీకానికి తెలియజెప్పడానికి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నేళ్లగానో అణచివేతకు గురవుతున్న తాడిత, పీడిత, అణగారిన వర్గాలకు అది భరోసా ఇచ్చేదిలా ఉంది' అని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అభిప్రాయపడ్డారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ పార్కులో అంబేడ్కర్ స్మృతివనాన్ని, అంబేడ్కర్ భారీ కాంస్య విగ్రహాన్ని 19వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

వారి మనోభావాలకు ప్రతీకగా...

'రాష్ట్ర జనాభాలో 72 శాతం బీసీ సామాజిక వర్గాలు, కోటి మంది ఎస్సీలు, 26 లక్షల మంది ఎస్టీలు ఉన్నారు. వారి మనోభావాలకు ప్రతీకగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయించారు. భారతీదేశ చరిత్రలో మరే రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఇలాంటి సంకల్పం తీసుకోలేదు. 19.40 ఎకరాల విస్తీర్ణంలో 81 అడుగుల ఎత్తైన ఫ్లాట్‌పారంతో కలిపి 206 అడుగుల ఎత్తైన విగ్రహ రూపకల్పనకు సుమారు 112 మెట్రిక్ టన్నుల కంచు, 352 మెట్రిక్ టన్నుల ఉక్కును ఉపయోగించారు. దాదాపు రూ.404 కోట్ల వ్యయమైంది. 2వేల మంది కూర్చొనే సామర్థ్యంతో ఆడిటోరియం కూడా నిర్మించారు.

స్ఫూర్తిని నింపే విగ్రహం...

అంబేడ్కర్ విగ్రహానికి ఆ మార్గంలో వెళ్తున్న ఓ ఐఏఎస్ అధికారి తన కారును ఆపి నమస్కారం చేసుకొని వెళ్లడం చూశాను. ఒక జడ్జి కూడా దణ్ణం పెట్టుకొని వెళ్లడం కనిపించింది. బడుగు బలహీన వర్గాలకే కాదు ఉన్నత స్థానాల్లో ఉన్నవారికీ అదొక స్ఫూర్తిని నింపే విగ్రహం. అదేదో ఉత్సవ విగ్రహంగా ఏర్పాటు చేశారనుకుంటే పొరపాటు. మన కోసమే జీవిస్తే మనలోనే ఉండిపోతాం. ప్రజల కోసం పనిచేస్తే ప్రజల గుండెల్లో ఉంటాం అనే అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని పూర్తిగా తీసుకున్నామని చెప్పడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేయించిన స్ఫూర్తి ప్రదాత ఈ విగ్రహం. ఆయన ముఖ్యమంత్రి గాకముందు ప్రతిపక్ష నాయకుడిగా ప్రజాసంకల్ప పాదయాత్ర చేసినప్పుడు 'ప్రతి ఇంట్లో నాన్న గారి ఫోటో పక్కన నా ఫోటో ఉండాల నేదే నా ఆశయం' అని తరచుగా చెప్పడానికి అంబేడ్కరే ఆయనకు స్ఫూర్తి.

అదొక నాలెడ్జ్ హబ్...

అంబేడ్కర్ విగ్రహం అదొక నాలెడ్జ్ హబ్. అత్యున్నత స్థాయికి ఎదగడానికి విద్య ఒక్కటే మార్గమని చెప్పడానికే ముఖ్యమంత్రి ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. విద్యను ఎవరైనా నిర్లక్ష్యం చేసినవారెవ్వరైనా సరే ఒక్కసారి ఆ విగ్రహాన్ని చూస్తే చాలు. నాలెడ్జ్ పవర్ తెలుస్తుంది. అంబేడ్కర్ స్ఫూర్తితోనే రాష్ట్ర విద్యారంగంలో సంస్కరణలు తీసుకొచ్చారని చెప్పవచ్చు. పేదరికమైనా మరే కారణమైనా సరే ఏ ఒక్క విద్యార్థీ విద్యకు దూరంకాకూడదనే పలు పథకాలు తీసుకొచ్చారు. ఐక్యరాజ్య సమితి (యూఎన్‌ఓ) నిర్దేశించిన 27 సమగ్ర అభివృద్ధి సూచికల్లో విద్య, వైద్యం తదితర 17 అంశాలు మన రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలవుతున్నాయి.

అభివృద్ధి అంటే అర్థమయ్యేలా...

ఒక దేశమో, ఒక రాష్ట్రమో అభివృద్ధి చెందిందంటే మనం చూడాల్సింది రంగుల గోడలు కాదు, అద్దాల మేడలు కాదు. దేశ ప్రజల వ్యక్తిగత అభివృద్ధే నిజమైన అభివృద్ధి అన్న అంబేడ్కర్ మాటల కార్యరూపమే నేడు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేసిన హ్యూమన్ క్యాపిటల్. మానవాభివృద్ధే దేశాభివృద్ధి. అందుకే ఈ రాష్ట్రంలో ఐదు కోట్ల మంది ప్రజల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ కేవలం తమ అర్హత ఒక్కటే ప్రామాణికంగా ఎలాంటి వివక్ష లేకుండా నేరుగా డీబీటీ ద్వారా రూ.2.37 లక్షల కోట్ల ఆర్థిక సాయం అందించడానికి అంబేడ్కరే స్ఫూర్తి.

అంబేడ్కర్ ఆశయాలు సాకారం...

వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో అంబేడ్కర్ ఆశయాలను, ఆలోచనా విధానాన్ని పూర్తిస్థాయిలో అమలుచేశారని గర్వంగా చెప్పవచ్చు. అంబేడ్కర్ భారీ కాంస్య విగ్రహాన్ని ఈనెల 19వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి సచివాలయం నుంచి ఏడుగురిని తీసుకెళ్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో ప్రముఖులను రాజకీయాలకు అతీతంగా ఆరోజు సన్మానం కూడా చేస్తున్నాం.

పోలమాంబ ఆలయానికి భక్తుల తాకిడి

- అమ్మవారి ఘటాలను మోసిన భక్తులు



అమ్మవారికి అలంకరించిన వెండి ఆభరణాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజనుల మద్దు బిడ్డ, భక్తులు కొంగుబంగారంగా కొలిచే కల్పవల్లి శంబర పోలమాంబ అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి పెరుగుతోంది. ఈనెల 22,23,24తేదీల్లో శంబర జాతర జరగనుంది. సుదూర ప్రాంతాలలో ఉన్న ప్రజలు సంక్రాంతి పండగకువారివారి గ్రామాలకు వచ్చిన విషయం తెలిసిందే. ఆయా ప్రాంతాలకు తిరిగి వెళ్లే ముందు అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో బుధవారం వందలాది మంది భక్తులు శంబర గ్రామానికి చేరుకుని, అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఘటాలకు పసుపు, కుంకుమ, పూలతో ప్రత్యేకపూజలు చేశారు. అలాగే వనంగుడిలో ఉన్న పెద్ద అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వెనకున్న పురాతన వేపచెట్టుకు మహిళలు పూజలు చేశారు.

గ్రామంలో ఘటాలు, పాల ధార తిరువీధి



తిరువీధిలో ఘటాలు పట్టుకున్న భక్తులు

గ్రామంలోని అన్ని పురవీధుల్లో అమ్మవారి ఘటాలు, పాలధార తిరువీధి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. భక్తులు ఎదురెళ్లి అమ్మవారి ఘటాలు, పాల ధార పట్టుకున్న మహిళకు కాళ్లు కడిగి, ఘటాలు, పాలధారలో బియ్యం వేసి పూజలు చేశారు. పసుపు, కుంకమలతో కలిగిన ముద్రాటను భక్తులకు ఆమె అందించారు. అమ్మవారి ఘటాలు, పాలధారను భక్తులు తలపై మోసి, మొక్కులు తీర్చుకున్నారు.

వెండి వక్షస్థలం కానుక

శంబర పోలమాంబ అమ్మవారికి తయారు చేయించిన వెండి వక్షస్థలాన్ని దేవాదాయశాఖకు దాతలు బుధవారం సమర్పించారు. విశాఖజిల్లా పెందుర్తికి చెందిన సాయికిరణ్, రమ్యకీర్తి దంపతులు అమ్మవారికి 1600 గ్రాముల వెండి ఆభరణాలను అందించారు. సుమారు రూ.1.60లక్షల విలువ చేసే వెండి ఆభరణాలను మంగళ వాయిద్యాలతో ఊరేగించి, అమ్మవారు కొలువైన చదురుగుడికి తీసుకువచ్చి, వేదమంత్రాలతో పూజలు నిర్వహించి, ఈవో సూర్యనారాయణ, మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ల సమక్షంలో అమ్మవారికి అలంకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రామస్వామి మృతదేహం

రాజాం సిటీ: మండల పరిధి గురవాం గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సంతకవిటి మండలం పుల్లిట గ్రామానికి చెందిన పిన్నింటి రామస్వామి (42) మృతిచెందాడు. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు రేగిడి మండలంలోని ఓ ఫ్యాక్టరీలో రామస్వామి విధులు నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే డ్యూటీకి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన వ్యక్తం చేశారు. మృతునికి భార్య సుందరమ్మ, ముగ్గురు కుమార్తెలు పల్లవి, శ్రీలత, వందనశ్రీ ఉన్నారు. ఈ ఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..

విజయనగరం క్రైమ్: స్థానిక పాతబస్టాండ్ ఎదురుగా గల షాపు మెట్ల మీద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు బుధవారం తెలిపారు. మృతుడు సుమారు 45 నుంచి 50 మధ్య వయసు కలిగి ఉన్నాడని, సమీపంలో విచారణ చేయగా ఎటువంటి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించామని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ బి.వెంకటరావు కోరారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

లారీ కింద పడి మహిళ..

కొత్తవలస: విశాఖ-అరకు (516) జాతీయ రహదారిపై కొత్తవలస మండలంలోని తాడివానిపాలెం జంక్షన్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరోగ్యశాఖలో పనిచేస్తు న్న ఎం.ఇందిరబాయ్(52) అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని పీఎంఎల్ కాంప్లెక్స్ వెనుకవైపు నివాసముంటున్న ఎం.ఇందిరాబాయ్ విశాఖపట్నంలో గల గోప్రభుత్వ విక్టోరియా హాస్పిటల్‌లో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తోంది. ఆమె తన స్కూటీపై విశాఖపట్నం వెళ్లి తిరిగి వస్తుండగా తాడివానిపాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న కారు ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో కారును ఢీకొట్టి రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ చక్రాల కిందికి వెళ్లిపోవడంతో నలిగిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రెండువైపులా ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న పోలీస్‌లు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

19న జిల్లాలో జన్ భాగీధారీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో జన్ భాగీధార్ కార్యక్రమం ఈనెల 19న నిర్వహించనున్నామని, దీనిని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలో 125 అడుగుల ఎత్తు గల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందని, అందులో భాగంగా జన్‌భాగీధార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 19న ఉదయం 7 గంటలకు సెయింట్ పీటర్స్ పాఠశాలనుంచి కలెక్టరేట్ వరకు మారథాన్, మానవహారం జరుగుతుందని చెప్పారు. అలాగే రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రక్తదాన శిబిరంలో యువత అధికంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉదయం 11 గంటలకు ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో అంబేడ్కర్ జీవిత చరిత్రపై ఛాయాచిత్రప్రదర్శన, సిగ్నేచర్ క్యాంపెయిన్, సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, సమాచార పౌరసంబంధాల అధికారి ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ క్రీడామైదానంలో నేడు మారథాన్

- కలెక్టర్ నాగలక్ష్మి



ఎస్.నాగలక్ష్మి, కలెక్టర్

విజయనగరం అర్బన్: సామాజిక సమతా సంకల్పయాత్ర మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 18న స్థానిక రాజీవ్ క్రీడామైదానంలో మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం గంటస్తంభం కూడలి మీదుగా కోట జంక్షన్, సింహాచలం మేడ కూడలి, బాలాజీ జంక్షన్ మీదుగా తిరిగి రాజీవ్ క్రీడామైదానం వరకు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యువత, వాకర్స్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చెక్‌పోస్టు వద్ద నిరంతర నిఘా



బైపాస్ రోడ్డులో వాహనాల రిజిస్ట్రేషన్ రికార్డు తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీధర్

రామభద్రపురం: త్వరలో సార్వత్రిక ఎన్నికలు ఉన్నందున పోలీస్ చెక్ పోస్టుల వద్ద నిరంతర నిఘా, పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. మండల కేంద్రంలోని బైపాస్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటుగా వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు సరిహద్దు అయినందున ఈ మార్గంలో అధిక మొత్తంలో నగదు, మాదకద్రవ్యాలు తరలించే అవకాశం ఉందని, అందుకే ఇక్కడ చెక్‌పోస్టు ఏర్పాటు చేసి ఒక ఎస్‌ఐ స్థాయి పోలీస్ అధికారి పర్యవేక్షణలో నిరంతర నిఘా పెట్టినట్లు చెప్పారు. అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్పీ దీపికాపాటిల్ ఆదేశాలు మేరకు మద్యం, మత్తు పదార్థాల అక్రమ రవాణా జరగకుండా పోలీసు సిబ్బందితో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

స్కిల్ స్కాంలో తీర్పు చెంపపెట్టు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తదితరులు

- బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై నమోదైన స్కిల్‌స్కాం కేసులో కోర్టు తీర్పు ఆయన అవినీతిని సమర్థించిన వారందరికీ పెద్ద చెంప పెట్టు అని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ కొన్ని నెలలుగా చంద్రబాబు అరెస్టు అక్రమమని, రాజకీయ కక్షతోనే అరెస్టు చేశారని, ఇది అన్యాయమని టీడీపీ అండ్ కో, ఎల్లోమీడియా గగ్గోలు పెట్టాయన్నారు. కానీ నిర్దోషి అని మాత్రం చంద్రబాబుతో పాటు ఇతరులు కూడా చెప్పకపోవడం విశేషమన్నారు. 17 ఎ వర్తించదని అన్నారే తప్ప తప్పు చేయలేదని చెప్పకపోవడం గమనార్హమన్నారు. అసలు అది వర్తిస్తుందా? వర్తించదా? అన్నది పక్కన పెడితే దోషి కాదని, ప్రభుత్వం ఇన్వాల్వ్‌మెంట్ ఉందని కానీ తీర్పులో లేదన్నారు. ఈ తీర్పులో అధికార పక్షం ఎలా వ్యవహరించిందో అందరికీ తెలిసిందేనని చెప్పారు. ఎప్పటి నుంచో సీఎం జగన్ మోహన్ రెడ్డి చట్టం తన పని చేసుకువెళ్తుందని చెబుతున్నారని, తీర్పు ఈ విధంగా వచ్చినప్పుడు గతంలో గగ్గోలు పెట్టిన దత్తపుత్రుడు, పలు కమ్యూనిస్టు పార్టీలు, ఎల్లో మీడియా వర్గాలు ఇప్పుడు కిక్కురుమనకపోవడం గమనించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి మచ్చలేకుండా వచ్చిన ఈ తీర్పు పెట్టని కోట అన్నారు. అవినీతిని సమర్థించే అన్ని పక్షాలకూ ఒక చెంప పెట్టు అయిన ఈ తీర్పును ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఇంటి గోపాల రావు, శంబంగి వేణుగోపాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కుటుంబాన్ని పరామర్శించిన డీవీజీ



చిట్టంపాడులో మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

శృంగవరపుకోట: మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ పరిధి చిట్టంపాడు గ్రామానికి చెందిన గంగమ్మ, తన బిడ్డ పది రోజుల వ్యవధిలో అనారోగ్యంతో చనిపోయిన సంగతి తెలిసిందే. గిరిజన కుటుంబాన్ని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి. శంకరరావు బుధవారం పరామర్శించారు. మృతురాలి పార్థివ దేహానికి నివాళులర్పించారు. మృతురాలి భర్త గంగులు, ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీహెచ్‌కు తీసుకెళ్లినా మందులు ఉచితంగా ఇవ్వలేదని, భీమిలిలో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం దక్కలేదని వాపోయారు. గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో సకాలంలో వైద్యసేవలు అందడంలేదన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశం మేరకు తను వచ్చానని, ఇక్కడి పరిస్థితిని వివరిస్తానని శంకరరావు చెప్పారు. ఆయన వెంట కొట్టాం పీహెచ్‌సీ వైద్యురాలు శిరీష ఉన్నారు.